క్లుప్తంగా

బీఈడీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లాలో యోగి వేమన విశ్వ విద్యాలయం పరిధిలోని కొన్ని బీఈడీ కాలేజీలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఈ విషయమై బుధవారం యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ బెల్లంకొండ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా వైవీయు పరిధిలోని బీఈడీ కాలేజీలు విద్యార్థుల వద్ద నుండి వేల రూపాయలు డబ్బులు వసూలు చేస్తున్నాయని అన్నారు. యూనివర్సిటీ అధికారులు తూతూ మంత్రంగా పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహిస్తూ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కడప నగర కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డా. సొహైల్ అహ్మద్‌కు అభినందన



డా. సొహైల్ అహ్మద్‌ను అభినందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, పార్టీ నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్ఈసీ) సభ్యులుగా నియమితులైన డా. సొహైల్ అహ్మద్‌ను మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష అభినందించారు. బుధవారం డా. ఖలీల్‌బాషా హాస్పిటల్‌లో ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, పార్టీ నాయకులు డిష్ జిలాన్, అజ్మతుల్లా, గయాజ్ తదితరులు సొహైల్ అహ్మద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, ఈస్ట్ జోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు ఇబ్రహీం మియా, బాబు భాయ్, అబ్దుల్ సుభాన్,ఫారూఖ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

17న నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 17న విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరసన చేపడుతున్నట్లు ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న జరగాల్సిన సమ్మె వాయిదా పడిన కారణంగా ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటల నుండి విద్యుత్ సౌధాలో పవర్ జేఏసీతో చర్చలు జరుగుతాయన్నారు. ఆ చర్చల్లో మన డిమాండ్స్ సానుకూలంగా పరిష్కారానికై అన్ని జిల్లాల్లో ఎస్ఈ ఆఫీసుల ముందు, దూర ప్రాంతాలైతే డీఈ, ఏఈ ఆఫీసుల ముందు ధర్నా, బైటాయింపు వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చర్చలకు వెళ్లిన వాళ్లు కాంట్రాక్ట్ కార్మికులకు 2022 పీఆర్సీ ఎరియర్స్ బకాయిలు, షిఫ్ట్ ఆపరేటర్లందరికీ ఒకే వేతనం, బిల్ కలెక్టర్స్, మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, డిస్కంలను ప్రైవేటీకరణ విధానాలు ఆపడం వంటి అంశాలపైన స్పష్టమైన, రాతపూర్వకమైన ఒప్పందం లేకుండా సమ్మెను, పోరాటాన్ని ఉపసంహరించుకోకూడదని స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు.

వసతిగృహాల తనిఖీ



హాస్టల్‌లో భోజనం తింటున్న వీసీ బెల్లంకొండ రాజశేఖర్, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ విద్యార్థుల వసతి గృహాలను వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల రుచి, నిర్వహణ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి, మందులు, ఇతర అవసరాలపై ఆరా తీశారు. ఉప కులపతి వెంట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ ఉన్నారు.

రెడ్డి సేవాసమితికి పుస్తకాలు అందజేత

కడప ఎడ్యుకేషన్ : సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అదనంగా ఉన్న 300 పుస్తకాలను రెడ్డి సేవా సమితికి అందజేశారు. యోగి వేమన విశ్వ విద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు కలసి కడప రెడ్డి సేవాసమితిలో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయం కోసం రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, సభ్యులు మద్దిక సుబ్బారెడ్డి, మాచిరాజు రమణయ్యలకు బుధవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అందజేశారు. పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతాం



రచ్చబండ కార్యక్రమానికి హాజరైన మహిళలు



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

'కోటి సంతకాల సేకరణ'లో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష హెచ్చరించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం 3వ డివిజన్‌లోని వికలాంగుల కాలనీలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు నాగేంద్ర ప్రసాద్ (బుజ్జి), నజీర్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెచ్చిన 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమన్నారు. ప్రైవేటీకరణ వల్ల పేదలకు నాణ్యమైన వైద్యం అందకుండా పోతుందని, పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు లభించకుండా పోతాయన్నారు. రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే అన్ని మెడికల్ కాలేజీలు పూర్తయ్యే అవకాశముందన్నారు. కాలేజీలకు ఖర్చుపెట్టడానికి నిధులు లేవంటున్న ప్రభుత్వం, గోరంత చేసి కొండంత చేశామని చెప్పుకునేందుకు ప్రచారానికి వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ విజయవాడ, హైదరాబాద్‌కు వందల సార్లు హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మునిగిపోయే రాజధాని కోసం రూ.2లక్షల కోట్లు వెచ్చిస్తున్నారని, వర్షాలొస్తే నీటిని తోడటానికి వేల కోట్లు ఖర్చుపెడుతున్నారన్నారు. ఈ ఖర్చులను నివారిస్తే మెడికల్ కాలేజీలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించవచ్చన్నారు.

జీఎస్టీతో దేశ ప్రజలను పీల్చి పిప్పిచేశారు

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం జీఎస్టీ ద్వారా దేశ ప్రజలను పీల్చి పిప్పి చేసిందని అంజద్ బాష విమర్శించారు. జీఎస్టీ తగ్గించి ఇప్పుడేదో ప్రజలకు మేలు చేసినట్లు చెప్పుకోవడానికి వందల కోట్లు ప్రచారానికి ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా పరిశీలకులు కె. సురేష్ బాబు మాట్లాడుతూ ప్రజలకు కూడు, గూడు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని గుర్తు చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వం, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసి విద్య, వైద్యాన్ని దూరం చేస్తోందన్నారు. ప్రతి ఏడాది రూ.1000కోట్లు కేటాయిస్తే ఈ మెడికల్ కాలేజీలు పూర్తవుతాయన్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మెడికల్ కాలేజీలు పోతే వైద్యం ఖరీదుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, జోనల్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్, రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు షఫీ, షంషీర్, పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, రవి, కంచుపాటి బాబు, సిండేరవి, సింధు, అక్బర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించాలి



డివిజన్లలో ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. రమేష్

కడప కార్పొరేషన్ : ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించాలని, క్లాప్ ఆటో ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. ఎస్. రమేష్ అన్నారు. బుధవారం 41 వ డివిజన్‌లోని రవీంద్రనగర్, 2వ డివిజన్‌లోని ఉక్కాయిపల్లి ప్రాంతాలలో ఆయన పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ క్లాప్ ఆటోలు ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను చెత్తను సేకరించే విధంగా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ మీ ప్రాంతంలో ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే సచివాలయ సెక్రటరీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. క్లాప్ ఆటోలకు వెళ్లే కార్మికులు ప్రజల వద్ద నుండి చెత్త సేకరించేటప్పుడు వారి నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు సంబంధిత ప్లాంట్లకు తరలించాలని తెలిపారు. కాలువలలో పూడికలు ఎక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం అడుగుజాడలు మనకు స్ఫూర్తిదాయకం



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ పుత్తాపద్మ

కడప ఎడ్యుకేషన్ : భారతదేశం అత్యంత ఆరాధించబడే శాస్త్రవేత్త, విద్యావేత్త మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం అని, ఆయన అడుగుజాడల్లో నడవాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. బుధవారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని వైవీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో రిజిస్ట్రార్ పుత్తాపద్మతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం పరిశోధన పటిమను, ఆదర్శ భావాలను వైవీయు లోని ప్రతి పరిశోధకుడు అంది పుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయు ప్రిన్సిపల్ ఆచార్య టి శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి లక్ష్మిప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కే ఎస్ వి కృష్ణారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిపుణులు అందించే జ్ఞానం విలువైంది

కడప ఎడ్యుకేషన్ : నిపుణుల అందించే జ్ఞానాన్ని ఆకలింపు చేసుకోవాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐ క్యు ఏసి) ఆధ్వర్యంలో బి.డి బయోసైన్స్ ఇండియా సహకారంతో 'ఫ్లో సైటో మెట్రీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అనే అంశంపై ఒకరోజు సదస్సు బుధవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ సదస్సును ప్రారంభించి నిపుణులను అభినందించారు. సెమినార్‌లో బి.డి బయోసైన్స్ సంస్థ సీనియర్ అప్లికేషన్ స్పెషలిస్ట్ కె. కరుణ కుమార్ 'ఫ్లో సైటోమెట్రీ సాంకేతికత' దాని అనేక అనువర్తనాలపై ఉపన్యశించారు. జనెటిక్స్ అండ్ జినోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. దక్షాయణి, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐ క్యు ఏసి) డైరెక్టర్ డాక్టర్ ఎల్. సుబ్రహ్మణ్యశర్మ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. 225 మంది సెమినార్‌లో రిజిస్టర్ చేసుకున్నారని వారు తెలిపారు. ఇందులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

19న 'మహాదాత బుడ్డా వెంగళరెడ్డి' పుస్తక పరిచయ సభ



బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తకం

కడప సెవెన్‌రోడ్స్ : మహాదాత బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ సభ ఈనెల 19వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించనున్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సభ జరగనుంది. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ అధ్యక్షత జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆత్మీయ అతిథిగా శాసనమండలి సభ్యులు ఎం.రామచంద్రారెడ్డి పాల్గొననున్నారు. విశిష్ట అతిథులుగా బుడ్డా వెంగళరెడ్డి ఐదవ తరం వారసులు బుడ్డా విష్ణువర్ధన్ రెడ్డి, పుస్తక రచయిత కుమ్మరి దస్తగిరి హాజరు కానున్నారు. వీరితోపాటు గౌరవ అతిథులుగా రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు మోపూరి బాలకృష్ణారెడ్డి, రెడ్డి సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథ రెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి పాల్గొనున్నారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు జీవీ సాయిప్రసాద్‌రెడ్డి పుస్తక సమీక్ష నిర్వహించనున్నారు.

పుస్తకం గురించి...

1866లో రాయలసీమలో తీవ్ర కరువు సంభవించింది. తినేందుకు తిండిలేక వేలాది మంది ఆకలి చావులకు గురయ్యారు. కలరా, మసూచి, మలేరియా, బోవెల్ డిసీజెస్ విజృంభించి జనం పిట్టాల్లా రాలిపోయారు. గ్రామాలు స్మశానాలను తలపించాయి. వేలాది కుటుంబాలు పొట్టచేత పట్టుకుని అన్నమో రామచంద్రా అంటూ వలసబాట పట్టారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బుడ్డా వెంగళరెడ్డి దానధర్మాల గురించి తెలిసి వేలాది మంది అక్కడికి తరలివచ్చారు. ఆ సమయంలో వెంగళరెడ్డి ఆత్మీయుడై ఆదుకున్నారు. తన వద్ద ఉన్న 12 పాతర్ల ధాన్యంతో అంబలి తయారు చేయించి ఆకలి తీర్చారు. ధాన్యం అయిపోవడంతో భూములు విక్రయించి కరువు బాధితుల ఆకలి తీర్చడం ద్వారా వారి ప్రాణాలు నిలిపారు. ఈ విషయం తెలుసుకున్న మద్రాసు ప్రెసిడెన్సీ గవర్నర్ బుడ్డా వెంగళరెడ్డిని పిలిపించి ఎంతో ఘనంగా సత్కరించి విక్టోరియా మహారాణి బంగారు పతకాన్ని అందజేశారు. నేటికీ ఆ పతకం ఉయ్యాలవాడ గ్రామంలోని వెంగళరెడ్డి వారసుల వద్ద ఉంది. అనాటి సామాజిక పరిస్థితులు, వెంగళరెడ్డి దాతృత్వం వంటి అనేక అంశాలు ఈ పుస్తకంలో పొందుపరిచారు.

రచయిత గురించి....

డొక్కల కరువు సమయంలో బుడ్డా వెంగళరెడ్డి నిర్వహించిన అన్నదాన మహాయజ్ఞంలో ఆయన అనుచరుడైన కుమ్మరి మైసూరు క్రియాశీలంగా వ్యవహరించారు. వంటా, వార్పు కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలోనే జరిగింది. ఆయన మునిమనవడు కుమ్మరి దస్తగిరి.. వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని రచించారు. ఆయన కేవలం రెండవ తరగతి మాత్రమే చదువుకున్నారు. ఆయన రాసిన ఈ పుస్తకం పలువురి ప్రశంసలు అందుకుంది.

మేదర్లను ప్రభుత్వం ఆదుకోవాలి




మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ మహేంద్ర మేదర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎల్లాల బాబు

కడప రూరల్ : అన్ని విధాల వెనుకబడిన మహేంద్ర మేదర వర్గాలను ప్రభుత్వాలు గుర్తించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహేంద్ర మేదర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎల్లాల బాబు కోరారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఆంధ్రప్రదేశ్ మహేంద్ర మేదర సంఘం కడప జిల్లా ఎన్నికలు, అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం చేపట్టారు. ఈమారు కూడా తనను గౌరవ అధ్యక్షులుగా, మస్తాన్‌రావును రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నారన్నారు. గత కొంతకాలంగా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ముఖ్యంగా తమ కుల వృత్తిలో భాగంగా వెదురు సేకరణకు అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే అటవీశాఖ అధికారుల కారణంగా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల మంది జనాభా ఉన్నప్పటికీ ప్రభుత్వాలు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇస్తున్న రాజకీయ నాయకులు తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించడం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా తమ అభ్యున్నతితోపాటు ఎస్టీలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు గంగయ్య, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులుతోపాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో ఆర్ఎంపీ వైద్యుల చెలగాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ప్రజల ప్రాణాలతో ఆర్ఎంపీ వైద్యులు చెలగాటం ఆడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆర్ఎంపీ క్లినిక్ సెంటర్ల పై అధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిప్యూటీ డీ.ఎం అండ్ హెచ్.ఓ ఉమా మహేశ్వరరావుకు డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, వేంపల్లి, వెల్లటూరు, పెండ్లిమర్రి, పోరుమామిళ్ల ప్రాంతాలలో విచ్చలవిడిగా ఆర్ఎంపీ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు అయ్యాయన్నారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని కానీ ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు వంటివి చేస్తున్నారన్నారు. తక్కువ ఖర్చు అవుతుందని పేద మధ్యతరగతి కుటుంబాల ప్రజలు ఆర్ఎంపీ క్లినిక్ సెంటర్ల వద్దకు వెళితే డయాగ్నొస్టిక్ సెంటర్ల వద్ద కమిషన్ పెట్టుకుని రక్తపరీక్షలు ఇతర వంటివి వాటికి అవసరం లేకున్నా రెఫర్ చేస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ ఆర్వీ కృష్ణకిషోర్

కడప ఎడ్యుకేషన్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు, నోడల్ ఆఫీసర్ ఆర్వీ కృష్ణకిషోర్ సూచించారు. నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కడపలోని స్పిరిట్ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది యువత మత్తుపదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. పునరావాసం అధికారి శ్రీకాంత్ .. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం పై జరిగే నష్టాల గురించి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈగల్ టీం అధికారి ఆయుబ్ ఖాన్ మాట్లాడుతూ మత్తు వ్యసనాలకు ఎవరైనా అలవాటుపడినట్లు తెలిస్తే 1972 కి కాల్ చేసి తెలపాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు అనే ప్రతిజ్ఞను చేయించి మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవీంద్ర, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ రియాజుద్దిన్, జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్ ద్వారా టపాసుల దుకాణాల కేటాయింపు

కడప కోటిరెడ్డి సర్కిల్ : దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసుల దుకాణాల ఏర్పాటుకు బుధవారం అధికారులు డిప్ తీశారు. కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తుదారుల సమక్షంలో అధికారులు డిప్ తీసి దుకాణాలను ఖరారు చేశారు. దుకాణాల ఏర్పాటుకు మొత్తం 139 మంది దరఖాస్తులు రాగా, అందులో 77 దుకాణాలకు డిప్ తీసి ఖరారు చేశారు. ఈ సందర్భంగా కడప తహసీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ టపాసుల దుకాణదారులు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా దుకాణాల ఏర్పాటు సమయంలో నిర్ణీత దూరం పాటించాలని, ఇసుక, నీళ్లను సిద్ధంగా ఉంచుకోవడంతోపాటు అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ శంకర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్

కడప అర్బన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారంగా 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శాంతి బుధవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మెంబర్స్‌తో వర్చువల్ పద్ధతిలో మీటింగ్ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబాఫ కృద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మెంబర్స్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఎస్.హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో చదువు, సేవ రెండు కళ్లవ్వాలి




ఉత్తమ సేవకులకు అందించిన సర్టిఫికెట్లతో వైవీయూ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశలోనే చదువు, సేవ అత్యధిక ప్రాధాన్యత అంశంగా భావించాలని వైవీయూ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై. సుబ్బరాయుడు ఉద్బోధించారు. మిట్టమీదపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో ఎన్.ఎస్.ఎస్-4, 7 యూనిట్ల పీఓలు డాక్టర్ కె. లలిత, డాక్టర్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశం బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య వై. సుబ్బరాయుడు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, గ్రామాల్లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహణ, సైబర్ సెక్యూరిటీ, బాలికల విద్య, మహిళల సైబర్ భద్రత వంటి వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించినందుకు పీఓ లను, వాలంటీర్లను అభినందించారు. ఎంబీఏ విభాగాధిపతి డా. పి. సరిత మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్లు, స్వచ్ఛంద సేవకుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. వారం రోజుల పాటు సాగిన ఈ శిబిరం 100 మంది స్వచ్ఛంద సేవకులకు సర్టిఫికెట్‌లు, ఉత్తమ సేవకులుగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోటనీ అధ్యాపకులు డా. రాజగోపాల్ రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో పాలకుల నిర్లక్ష్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన సమస్యలపై నవంబర్ లో 4 జోన్ల వారీగా కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకట శివ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ నగర వెస్ట్ జోన్ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగర ప్రజా సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం, అన్యాయం, అవినీతిపై ఉద్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్య లైన నీటి కొరత, పారిశుద్ధ్య డ్రైనేజీ సమస్యలు, చెత్త సేకరణ లోపాలు, వీధిలైట్లు, పన్నుల అన్యాయ పెంపులు, అక్రమంగా పన్నుల మార్పులు చేర్పులు, మున్సిపల్ అవినీతి, అక్రమ లేఅవుట్ భూకబ్జా మాఫియా దోపిడీలు, విలీన పంచాయతీల పరిధి ప్రాంతాల్లో మౌలిక వసతుల లేమి తదితర సమస్యలపై ఆందోళనలు చేపడుతున్నామన్నారు. నవంబర్ నెలలో నాలుగు జోన్ లు ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ ల వారీగా ఆయా డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల కాలనీల స్థానిక ప్రజా సమస్యల పై కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ కడప నగర వెస్ట్ జోన్ నాయకులు యు.మద్దిలేటి, సావంత్ సుధాకర్, చెంచయ్య, మునయ్య, నాగరాజు, శివ నాగేంద్ర, లక్ష్మీ నారాయణ, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.





రోడ్లు జలమయం

కడప నగరంలో బుధవారం మధ్యాహ్నం ఉన్నట్లుండి వర్షం కురి సింది. దీంతో నగరంలోని పలు రోడ్లు జలమయం అయ్యాయి. అశోక హోటల్ నుంచి బీకేఎం స్ట్రీట్‌లోకి వెళ్లే పలు రోడ్లపై నీరు నిలిచాయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప